

భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఆలయ సన్నిధిలో పసుపు కొమ్ములు దంచుతున్న అర్చకులు

## భద్రాద్రిలో నేత్రపర్వంగా వసంతోత్సవం

- ఉత్సవమూర్తులకు పంచామృతాలతో ప్రత్యేక స్నపనం
- రామయ్య పెండ్లి తలంబ్రాల తయారీకి శ్రీకారం
- నయనానందకరంగా పసుపు దంపుడు కార్యక్రమం

భద్రాచలం, మార్చి 25: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం డోలోత్సవం, వసంతోత్సవాలను నేత్రపర్వంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పంచామృతాలతో ప్రత్యేక స్నపనం చేపట్టారు. ఏప్రిల్ 17న శ్రీరామ నవమిని పురస్కరించుకొని స్వామివారి కల్యాణంలో వినియోగించే తలంబ్రాల తయారీకి సంప్రదాయబద్ధంగా శ్రీకారం చుట్టారు. వేదపండితుల మంత్రాల నడుమ అలంకరించిన బంగారు ఊయలలో స్వామివారిని ఆశీనులను చేసి డోలోత్సవం జరిపారు. హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారికి వసంతోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. తొలుత అంతరాలయంలోని మూలవరులకు, లక్ష్మీ తాయారమ్మ వారికి, ఆంజనేయస్వామికి వసంతాన్ని చల్లి.. తర్వాత భక్తులపై చిలకరించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ జరిపారు. మిథిలా ప్రాంగణం ఎదురుగా ఉన్న ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను ఆశీనులను చేసి రోలు, రోకళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణంలో పాల్గొనే ఆచార్య, బ్రహ్మరుత్వికుల రోళ్లలో పసుపు కొమ్ములు వేసి దంచగా.. తర్వాత వారి భార్యలు రోళ్లలో పసుపు కొమ్ములు వేసి దంచారు. ఆ తర్వాత పసుపు, కుంకుమ, నెయ్యి, బుక్కా గులాల్, అత్తరు, పన్నీరు తదితర సుగంధ ద్రవ్యాలతో తలంబ్రాలను కలిపే వేడుకలను నయనానందకరంగా నిర్వహించారు.



రెండు వర్గాలుగా విడిపోయి గుద్దుకుంటున్న గ్రామస్థులు

## 5 నిమిషాలు ఊరంతా గుద్దుకున్నారు

నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం హున్సా గ్రామంలో హోలీ పండుగను పురస్కరించుకొని ఏటా నిర్వహించే పిడిగుద్దులాటను ఈ ఏడాది కూడా నిర్వహించారు. సోమవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో గ్రామస్థులు రెండు గ్రూపులుగా విడిపోయి హనుమాన్ మందిరం వద్దకు చేరుకొన్నారు. అడ్డంగా కట్టిన తాడుకు రెండు వైపులా నిల్చొని ముఖాలు, వీపులపై పిడుగుద్దులు గుద్దుకున్నారు. ఈ ఆట సుమారు 5 నిమిషాలపాటు కొనసాగింది.

–బోధన్ రూరల్

# రాష్ట్రంలో భారత్ రైస్ పంపిణీ ఎప్పుడు?

- మీనమేషాలు లెక్కిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- దేశంలో చాలా రాష్ట్రాల్లో అమలవుతున్నా తెలంగాణలో ప్రారంభంకాని పథకం
- అమలుకు నోడల్ ఏజెన్సీలు సిద్ధంగా ఉన్నా బియ్యాన్ని కేటాయించేందుకు ఎఫ్‌సీఐ నిరాకరణ
- రాష్ట్రానికి అవసరమైన స్టాక్ లేదంటూ సాకులు

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 'భారత్ రైస్' పథకం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో అమలు చేసేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నది. రాష్ట్రంలో ఈ పథకం అమలుకు అవసరమైనన్ని బియ్యం నిల్వలు లేవని సాకులు చెప్తున్నది. బియ్యం అందుబాటులో ఉన్నప్పుడు కేటాయిస్తామని, అప్పటి వరకు రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేయబోమని నోడల్ ఏజెన్సీలకు ఎఫ్‌సీఐ అధికారులు తేల్చి చెప్పినట్టు తెలుస్తున్నది. దీంతో రాష్ట్రంలోని నిరుపేదల పొట్ట కొట్టిందని కేంద్రంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇతర రాష్ట్రాల్లో అందుబాటులో ఉన్న బియ్యం నిల్వలు తెలంగాణలోనే ఎందుకు లేవన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు ఇప్పటికే భారీగా పెరగడంతో జనం అల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో బియ్యం ధరలను కట్టడి చేయడంతోపాటు సామాన్య ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 6న 'భారత్ రైస్' పథకాన్ని ప్రారంభించింది. అందులో భాగంగా కిలో రూ.29కే బియ్యాన్ని విక్రయిస్తున్నది. నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్ లాంటి సంస్థల ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నది. ఇందుకు అవసరమైన బియ్యాన్ని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ఆయా సంస్థలకు అందించాల్సి ఉంటుంది. తెలంగాణలో 'భారత్ రైస్' పథకాన్ని అమలు చేసేందుకు నాఫెడ్, కేంద్రీయ భండార్ లాంటి నోడల్ సంస్థలు సిద్ధంగా ఉన్నప్పటికీ కేంద్రం, ఎఫ్‌సీఐ నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఆ సంస్థలు వేచి చూస్తున్నాయి.

### బియ్యం లేవంటూ సాకులు

రాష్ట్రంలో ఫోర్టిఫైడ్ రైస్ మాత్రమే అందుబాటులో ఉందని, నాన్-ఫోర్టిఫైడ్ రైస్ (సాధారణ బియ్యం) అందుబాటులో లేవని ఎఫ్‌సీఐ చెప్తున్నట్టు తెలిసింది. దీంతో ఎఫ్‌సీఐ సరిగ్గా దృష్టి పెడితే సీఎంఆర్ కోటాలో మిల్లర్ల నుంచి నాన్-ఫోర్టిఫైడ్ రైస్ తీసుకోవడం పెద్ద కష్టమేమీ కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ, ఆ దిశగా కేంద్రం చర్యలు చేపట్టకపోవడంతో భారత్ రైస్ పథకాన్ని తెలంగాణలో అమలు చేయొద్దని మోదీ సర్కారు భావిస్తున్నదేమోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో సైతం అమలవుతున్న ఈ పథకాన్ని పుష్కలంగా బియ్యం అందుబాటులో ఉండే తెలంగాణలో ఎందుకు అమలు చేయలేకపోతున్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.



## అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**అటవీ,పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ**

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సోమవారం అటవీ అధికారులతో మంత్రి సమీక్షించారు.



ఈ మధ్య కాలంలో అమ్రాబాద్, కవ్వాల్, తాడ్వాయి, ఇల్లందు తదితర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నట్టు సమాచారం వచ్చిందని, ఈ ప్రమాదాల వల్ల వన్యప్రాణులతోపాటు విలువైన అటవీసంపద నష్టపోయే అవకాశం ఉన్నందున అధికారులంతా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాల వల్ల పర్యావరణంలో సమతుల్యత లోపించి విపత్తుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతాల గుండా ప్రయాణించే వారు అధికారుల సూచనలు పాటించాలన్నారు. అడవుల్లో వంట చేయడం, సిగరెట్, బీడీ పీకలు పడేయవద్దని సూచించారు. ప్రమాదాల నివారణ కోసం అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్‌ను మంత్రి కొండా సురేఖ ఆదేశించారు.

## గంజాయి అలవాటు చేసి.. లైంగిక దాడి!

- ఇద్దరు యువకులతో సహా బాలుడి అరెస్ట్
- ముగ్గురిపై పోక్సో, ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసు

*జగిత్యాల కలెక్టరేట్, మార్చి 25: ప్రేమ పేరుతో బాలికను నమ్మించి గంజాయి అలవాటు చేసి లైంగికదాడి చేసిన ఇద్దరు యువకులతోపాటు ఓ బాలుడిని అరెస్ట్ చేసినట్టు జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకనటలో తెలిపారు. తన కూతురిని గంజాయికి బానిస చేసి ముగ్గురు వ్యక్తులు లైంగికదాడి చేశారని బాలిక తండ్రి ఈ నెల 23న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ జరిపినట్టు చెప్పారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్లపల్లికి చెందిన ఆరెల్లి ప్రేమ్ కుమార్, మల్లాపూర్ మండలం చిట్టాపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్ ప్రేమిస్తున్నామంటూ బాలికకు గంజాయి అలవాటు చేసి బలవంతంగా లైంగికదాడి చేశారు. అనంతరం వదిలేశారు. ప్రస్తుతం ఆ బాలిక పదో తరగతి మధ్యలోనే ఆపేసి ఇంట్లో ఉంటున్నది. అదే ప్రాంతంలో నివాసం ఉండే ఓ బాలుడు ప్రేమిస్తున్నానంటూ బాలికకు దగ్గరయ్యాడు. బాలుడు కూడా బాలికకు మత్తు పదార్థాలు ఇచ్చి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తండ్రి, చైల్డ్‌వెల్ఫేర్ అధికారులు, డీ అడిక్ట్ సెంటర్ వారి స్టేట్‌మెంట్‌ల ఆధారంగా చేపట్టిన విచారణలో.. ప్రేమ్‌కుమార్, వెంకటేశ్, బాలుడు వేర్వేరుగా బాలికకు మత్తుపదార్థాలు అలవాటు చేసి లైంగికంగా వాడుకున్నారని తేలిందని, దీంతో ఆ ముగ్గురిని అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. ప్రేమ్‌కుమార్, వెంకటేశ్ నుంచి 140 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని ముగ్గురిపై పోక్సో యాక్ట్, ఎన్‌డీపీఎస్ యాక్టు కింద కేసు నమోదు చేశారు.*

### మీడియా సంయమనం పాటించాలి

*సమస్య సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకొని మీడియా సంయమనాన్ని పాటించాలని సీఐ సూచించారు. బాధితులకు సంబంధించిన ఐడెంటీని, సంబంధిత వ్యక్తుల వివరాలను ఏ రూపంలోనైనా బహిర్గతం చేస్తే సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం శిక్షార్హులవుతారని పేర్కొన్నారు.*

## భారత్‌తో చర్చలు జరపండి

- మాల్దీవులు అధ్యక్షుడికి మాజీ అధ్యక్షుడి సూచన

మాలే, మార్చి 25: మాల్దీవులు అధ్యక్షుడు మయిజ్జు మొండి వైఖరి వీడాలని, భారత్‌తో చర్చలు జరపాలని ఆ దేశ మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం సోలే సూచించారు. చైనా అనుకూలుడుగా ముద్రపడిన ప్రస్తుత అధ్యక్షుడు మయిజ్జు భారత్ పట్ల తీవ్ర వ్యతిరేక వైఖరిని ఎంచుకోవటాన్ని మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం సోలే తప్పుబడుతున్నారు. ఏప్రిల్ 21న మాల్దీవులు పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌తో మాల్దీవులు సంబంధాలు దెబ్బతినటం అక్కడ చర్చనీయాంశమైంది. తాజాగా మాఫాన్నులో ఎన్నికల ర్యాలీలో ఇబ్రహీం సోలే మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'రుణ పునర్వ్యవస్థీకరణపై భారత్ సాయం కోరటం తప్పు లేదు. మొండితనంతో వెళ్లకుండా భారత్‌తో చర్చలు జరపాలని ఆయనకు సూచిస్తున్నా' అని సోలే అన్నారు.

**కంగనపై కాంగ్రెస్ మహిళా నేత**

## అభ్యంతరకర పోస్ట్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగనున్న బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌పై కాంగ్రెస్ మహిళా నాయకురాలు సుప్రియా శ్రీనేత్ అభ్యంతరకర పోస్ట్ చేయడం దుమారం రేపింది. దీనిపై కంగన మండిపడ్డారు. '20 ఏండ్లలో అనేక పాత్రల్లో నటించాను. మహిళలను దురభిమానపు సంకెళ్ల నుంచి కాపాడుకోవాలి. సెక్స్ వర్కర్ల దుర్భర జీవితాలను ప్రస్తావిస్తూ ఇతరులను దూషించడం మానుకోవాలి. ప్రతి మహిళా తన గౌరవానికి అర్హురాలు' అని కంగన పేర్కొన్నారు. అయితే తన ఫేస్‌బుక్ ఖాతా యాక్సెస్ చాలా మంది దగ్గర ఉన్నదని, ఆ పోస్ట్ తాను చేయలేదని సుప్రియ పేర్కొన్నారు. సుప్రియపై చర్యలు తీసుకోవాలని ఈసీకి ఎన్‌సీడబ్ల్యూ లేఖ రాయనున్నది.

## నకిలీ పోలీసులతో జాగ్రత్త

- డ్రగ్స్ పార్సిళ్లు, ఉగ్రవాదులతో సంబంధాలని ఫేక్ కాల్స్
- టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సూచన

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : డ్రగ్స్ పార్సిళ్ల పేరుతో నకిలీ పోలీసుల ఫోన్ కాల్స్ వస్తున్నాయని .. నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సూచించారు. తాజాగా ముంబై క్రైం బ్రాంచి నుంచి మాట్లాడుతున్నామని చెప్పి ఐఐటీ పీహెచ్‌డీ స్కాలర్‌కు రూ.30 లక్షలు కుచ్చుటోపీ పెట్టారని ఎక్స్ (ట్విట్టర్) ద్వారా తెలిపారు. అజ్ఞాత వ్యక్తుల నుంచి డ్రగ్స్ పార్సిళ్ల పేరుతో ఫోన్ కాల్స్ కానీ, ఐవీఆర్‌కాల్స్ వస్తే వాటికి అసలే స్పందించవద్దని చెప్పారు. జాగ్రత్తగా వ్యవహరించాలని, వారికి ఎలాంటి వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దని సూచించారు. డ్రగ్స్ కేసు అని, ఉగ్రవాదులతో సంబంధాలని బెదిరించగానే భయపడి డబ్బులు బదిలీ చేయవద్దని చెప్పారు. ఒకవేళ మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫోన్ చేయాలని సూచించారు. లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని వీసీ సజ్జనార్ ఎక్స్(ట్విట్టర్) ద్వారా వివరించారు.

**'బుద్ధవనం'ను సందర్శించిన**

## వియత్నాం బృందం

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : బుద్ధుడు, ఆచార్య నాగార్జునుడి గురించి తమ తల్లిదండ్రుల ద్వారా తెలుసుకున్నామని, నేడు వారికి సంబంధించిన మ్యూజియంను ప్రత్యక్షంగా సందర్శించడం ఎంతో సంతోషాన్నిచ్చిందని వియత్నాం మీడియా ప్రతినిధుల బృందం పేర్కొన్నది. హైదరాబాద్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో జర్నలిజం అండ్ పబ్లిక్ రిలేషన్స్‌పై శిక్షణ కోసం వచ్చిన సభ్యులు తమ పర్యటనలో భాగంగా నాగార్జునకొండ, బుద్ధవనం ప్రాజెక్టు, ఏఎస్ఐ మ్యూజియంను సందర్శించింది. ఈ సందర్భంగా బుద్ధుడి స్థూపాలు, అప్పటి వస్తువులు, ఆచార్య నాగార్జునుడికి సంబంధించిన వీడియోలను తిలకించారు. బుద్ధుడి విగ్రహానికి ప్రార్థనలు చేశారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 26మంది మీడియా ప్రతినిధులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

